మేదస్సు దూషితమయినపయిని మలద్వారములో మాంసాంకురములు బయలుదేరును. ఈయంకురము లావగింజలంత లేసిగా ప్రారంభించి క్రమముగా పెరిగి పెద్దవగును. కొందఱ కొకటి, కొందఱకు రెండు, కొందఱకు మూఁడును పెరిగిపోవును. కొందఱి కామొలకలనుండి రక్తము మేఁకను కోసినారా అన్నట్టుగా ధారగట్టి ప్రవహించును. ఒకానొక దురదృష్టవంతునకు మూఁడుమొలకలును పొంగిపోయి యొక్కటిగా నయిపోవును. అట్టివానికి మల ప్రవృత్తిమాట అటుండఁగా వాయువుకూడ లోపలినుండి బయటికి రాఁజాలదు. అట్టి స్థితిలో వ్రేళ్ళతో మలము తీయవలసివచ్చును. ఇదిపుట్టినతర్వాతను గుల్మము, ప్లీహము, ఉదరము, జ్వరము, మూర్ఛ, తృష, అరతి దాహము, శ్వాసము, కాసము, హృల్లాసము, అరుచి, పీనస, ప్రమేహము, మూత్రకృచ్ఛ్రము, క్లైబ్యము, మందాగ్ని, ఛర్ది, శిరోజాడ్యము మొదలయినవి పెక్కు ఆనుజన్య వ్యాధులు కలుగును. రక్తార్శస్సులో రక్తము హెచ్చుగా పోయిన తర్వాతను రోగిస్వరూపము పచ్చని కప్పలాగున నయిపోవును. బలము, వర్ణము, ఉత్సాహము నష్టమయిపోవును. ఇట్టి దుర్జయవ్యాధియనెడి గట్టికోటను ధ్వంసముచేయుటకు తక్రమే కంచుఫిరంగి. దాని ప్రహారమువలననే అది ధ్వంసమై నామావశేషమగును. కావున తక్రమును సామాన్యమయినదానినిగా ఉపేక్షింపక ప్రతివారును సేవించుచు నీరోగులయి సర్వసుఖముల ననుభవించుచుందురు గాక యని కోరెదము.

---

# ప్రభాతగానము

శ్రీ. శ్రీ. (కవితాసమితి)

అస్మదీయపరిఫుల్ల హృదంతరాళ
సంస్థిత పవిత్రతర భావసముదయ ప్ర
దర్శనోత్సుకమతినొచ్చుఁ దమకమెసఁగ
దేవి! నీ సన్నిధికి నేగుదెంచినాఁడ!
అత్యుదగ్రతమిస్రదుర్వ్యావృతి ప్ర
భిన్నమానైక శక్తి సంపన్ననిశిత
భానుకిరణ ప్రశస్తమై ప్రాచి తోఁచె
సమయమయ్యెను నీ పూజ సలుపుకొఱకు.

ఏ యనంత ప్రభావ దుర్జ్ఞేయమాన
మానితాచ్ఛ పరంజ్యోతివో నితాంత
నిస్తుల గుణాఢ్యవో యట్టి నిస్సనంగ
గందళించిన హృదయారవిందసుమము
భక్తిపూర్వకముగ సమర్పణ మొనర్తు
మహిత భవదీయరూప సంపద్విలాస
నిర్మలాంచిత మందాకినీ తరంగ
సమవగాహనోపార్జిత విమలపుణ్య
మహిమ కారణ గళిత కల్మషుఁడనైతి
నిముసకాలము నిన్ను ధ్యానింప నిమ్ము.

దీర్ఘహర్ష ప్రదాయక దివ్యభావ
గీతికా నవ్యరాగ సంకీర్తనమున
నైక్య మయ్యెద త్వన్మనోహర దిగంత
విశ్రుతశ్లోక పరిశుభ్రవీచికలను.

---